




1. మనీషా పంచకం
2. ముముక్షు గీతా త్రయోదశకం

జగద్గురు ఆదిశంకరుల మనీషాపంచకం
మరియు స్వామి వివేకానందుల Songs of Sannyasin
మూలము మరియు తెలుగు అనువాదం

అనువాదకర్త : వనం వేంకట వరప్రసాదరావు

రచయిత పరిచయం



వనం వేంకట వరప్రసాదరావు

(ఎం.ఏ. ఆంగ్లం, జ్యోతిష్యం, తెలుగు)

భారత జీవిత బీమా సంస్థ మధిరలో వికాసాధికారిగా పదవీ విరమణ చేశారు.

పద్య, వచన కావ్యకర్త, నాటక కర్త, గేయ రచయిత, సంకీర్తనా కారుడు, రంగస్థల నటుడు, దర్శకుడు, TV ఛానెల్స్ లో సాహిత్య, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, కార్టూనిస్ట్, హరికథకుడు, వ్యాసకర్త, సాహిత్య విమర్శకుడు, కథకుడు.

ఇతర రచనలు :-

- ★ గేయాలు-గాయాలు (వచనకవితా సంపుటి)
- ★ నాచ్చియార్ తిరుమొళి (ఆంధ్రానువాదం)
- ★ తిరుప్పావై (ఆంధ్రానువాదం)
- ★ గోదాకళ్యాణం (ఆముక్తమాల్యద నాటకీకరణ)
- ★ భక్తప్రహ్లాద (పౌరాణిక పద్యనాటకం)
- ★ మనుచరిత్రము (సాహిత్యవిమర్శ)
- ★ శ్రీ వినాయక విజయం (పద్యఖండిక)
- ★ నీ స్మృతిలో (A Tennyson s In Memoriam) ఆంధ్రానువాదము
- ★ వేదాంతకేసరి (నాటిక)
- ★ ఆముక్తమాల్యద (సాహిత్యవిమర్శ)
- ★ శ్రావణ లక్ష్మి (పద్యఖండిక)
- ★ మీరా భజనలు (గేయానువాదము)
- ★ యజ్ఞఫలం (సాంఘిక నాటిక)
- ★ ఎయిడ్స్ (సాంఘిక నాటిక)
- ★ నిరీక్షణ (సాంఘిక నాటిక)
- ★ రాగసాహితి (72 మేళకర్త రాగాల కృతులు)
- ★ విముక్తి (సాంఘిక నాటిక)
- ★ దశావతారాలు (పద్యఖండిక)
- ★ మహాకవి కాళిదాసు (పద్యనాటకం)
- ★ ఇంకా అనేక సుప్రసిద్ధ హిందీ, ఆంగ్ల కవితల ఆంధ్రానువాదం

మనీషా పంచకం - ముముక్షు గీతా త్రయోదశకం

(జగద్గురువు ఆది శంకరుల మనీషా పంచకం మరియు స్వామి వివేకానంద రచన Songs of Sannyasin మూలము మరియు తెలుగు అనువాదం)

అనువాదం : వనం వేంకట వరప్రసాదరావు

ప్రచురణ కర్త :

చైతన్యభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ (రి.7171/2000)

ఇంటి నెం. 12-127/1, శ్రీనిలయం, కస్తూరిబాయి రోడ్, మధిర,

ఖమ్మం జిల్లా, తెలంగాణ. పిన్.నెం.507203

సెల్ : 9866805165

ఈ మెయిల్ : varaprasadchaitanyabharathi@gmail.com

వెల : అమూల్యము

ప్రతులు : 200

ప్రథమ ముద్రణ : ఆగష్టు, 2026

1. సంస్కృత మూలం :

జాగృత్ స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృమ్భతే
యా బ్రహ్మాది పిపీలకాంత తనుషు ప్రోతా జగత్సాక్షిణీ
సైవాహం నచ దృశ్య వస్త్వితి దృఢ ప్రజ్ఞాపి యస్యాస్తిచేత్
చండాలోస్తు సతు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ

1.అనువాదం :

తొణికిసలాడే 'కళ'

మెలకువలో, కలలో,
కదలని గాఢ నిద్రలో,
ఇమ్మనుజులలో, బ్రహ్మదేవునిలో,
పిపీలకాదుల శరీరాలలో,
చరాచరమ్ముల శరీరాలలో,
నిన్నా, నేడూ, రేపూ నిలిచే,
అంతరంగమున, బహిరంగములో,
సాక్షిగ అక్షరమై వెలుగొందే
వెలుగును, నే నీ మేను కాననే
జ్ఞప్తిని కలిగిన వాడెవడైనా
కులము, మతము, జాతేదైనా,
మనుజులలో నడయాడే దేవుడు!
మరి యాతడె పో నా గురుదేవుడు!

2. సంస్కృత మూలం :

బ్రహ్మైవాహ మిదం జగచ్చ సకలం చిన్మాత్ర విస్తారితం
సర్వం చైత దవిద్యయా త్రిగుణయాశేషం మయా కల్పితం
ఇత్థం యస్య దృఢా మతిస్సుఖతరే నిత్యే పరే నిర్మలే
చండాలోస్తు సతు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ

2. అనువాదం :

బ్రహ్మమయమిది ప్రపంచమంతా,
చిన్మయ రూపం ఈ జగమంతా,
'త'న్మయమై తనరారినదంతా!
తప్పుగ తలచితి నేను ఒకింత,
అవిద్యచే, త్రిగుణమ్ములచేత ,
ప్రపంచమంతా శాశ్వతంబని!
కలయికలన్నీ వీడిపోవును,
కనపడు సర్వము కదిలి పోవును,
వినపడు స్వరములు అణగి పోవును!
బ్రహ్మము చిన్మయమొకటి శాశ్వతం,
మిగిలిన సర్వము, జగము నశ్వరం!
అని ధృఢముగ తెలిసిన సుఖుదెవరో
సన్మతి, స్థిరమతి, నిర్మలుదెవరో
కులము, మతము, జాతేదైనా,
మనుజులలో నడయాడే దేవుడు
మరియాతడె పో నా గురుదేవుడు!

3. సంస్కృత మూలం :

శశ్వన్నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచా గురో
నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజ శాంతాత్మనా
భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే పావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపురిత్యేషా మనీషా మమ

4. అనువాదం :

ఏ కళ వెలుగై కదలు వాటిలో
వృక్ష జాలముల, జంతు కోటిలో
మానవులందు, దేవతలందు
దృశ్యమానమై వెలుగుచున్నదో,
హృదయ కుహరమున వెలిగే ఏ కళ
ప్రాణి కోటికిల ప్రాణమైనదో,
ఏ వెలుగునుగొని జీవులు కళకళ
లాడుచుందునో సాగుచుందునో
ఆ వెలుగారిన ఆగుచుందునో
ఆ వెలుగుల గని వెలిగించునది
వెలుగు వానిలో కనిపించునది!
జీవకోటికా వెలుతురొక్కటే
జీవులన్నిటా వెలుగునొక్కడే
అని తెలిసిన మానవుడెవరైనా
కులము, మతము, జాతేదైనా,
మనుజులలో నడయాడే దేవుడు!
మరి యాతడె పో నా గురుదేవుడు!

5. సంస్కృత మూలం :

యత్సౌఖ్యామ్బుధి లేశ లేశత ఇమే శక్రాదయో నిర్వృతా
యచ్చిత్తే నితరాం ప్రశాంత కలనే లబ్ధ్వా మునిర్నిర్వృత
యస్మిన్ నిత్య సుఖామ్బుధౌ కలిత ధీ ర్బ్రహ్మైవ న బ్రహ్మవిత్
యః కశ్చిత్ ససురేంద్ర వందిత పదో నూనం మనీషా మమ

5. అనువాదం :

ఏ సుఖ సాగర చిరు బిందువులై
దేవేంద్రాదులు సంతసింతురో,
చిత్తమునందే లేశమైన సుఖ
భావముచే మునులానందింతురొ,
ఆనందమిది–అనుభవమిది యని
ఎరుగక అద్వైతానుభావమున
ఆనందము తామై తాముండెదరో
ఆ బ్రహ్మానందాంబుధి మునిగిన
బ్రహ్మానందమె తానై మిగిలిన
అద్వైతామృత విందులందిన
నరుడే సుర, ముని, బుధ వందితుడు,
కులము, మతము, జాతేదైనా,
మనుజులలో నడయాడే దేవుడు!
మరి యాతడె పో, నా గురుదేవుడు!

మనీషాపంచకం - విపుల వ్యాఖ్యానం

జగద్గురువు ఆది శంకరాచార్యులవారు కాశీ పట్టణంలో బస చేసిన రోజులలో ఒకనాడు గంగానదిలో స్నానం చేసి శిష్యులు ముందు నడుస్తుండగా రేవునుండి వస్తున్నప్పుడు ఒక చండాలుడు నాలుగు వేట కుక్కలతో వీరికి ఎదురుగా వచ్చాడు. శంకరాచార్యులవారి శిష్యులు ఆ చండాలుడిని ప్రక్కకు తప్పుకొని దారి యిమ్మని అన్నారు, వెనుకగా వస్తున్న తమ గురువు గారికి అతను అడ్డుగా వస్తాడేమోనని.

అప్పుడా ఛండాలుడు ఒక ప్రశ్న వేశాడు. ఎవరినయ్యా తప్పుకోమంటున్నారు? అని (అంటే నన్నా తప్పుకొమ్మంటున్నారు? నన్నే అయితే శరీరంచేత ఎవడూ నీచుడూ కాదు, ఉన్నతుడూ కాడు కదా! పైకి కనిపించే నేను నిత్యం కాదు, లోపలి నేనే నిత్యుడు, శాశ్వతుడు కదా. మీలోనూ నాలోనూ వున్న ఆ 'నేను' అనేదానికి ఏ మాలిన్యమూ లేదు కదా, మరి ఎందుకు ప్రక్కకు తప్పుకొమ్మంటున్నారు? నా లోపలి 'నేనే', అంటే ఆత్మస్వరూపియే ఈ విశ్వమంతటా నిండి వున్నాడు కదా! అనే లోతైన భావంతో వేసిన ప్రశ్నగా ఆ ప్రశ్నను భావించిన ఆది శంకరాచార్యులవారు అంత లోతైన ప్రశ్నను వేసిన ఆ చండాలుడిని సాక్షాత్తూ శివునితో సమానుడిగా, ఆ నాలుగు కుక్కలను నాలుగు వేదములుగా భావించి, సాష్టాంగ నమస్కారం చేసి, ఐదు శ్లోకాలలో వెలువరించిన స్తోత్రమే మనీషా పంచకం.

ఐదు శ్లోకాలు వున్నాయి కనుక పంచకం. ప్రతి శ్లోకమూ 'మనీషా మమ' (అంటే నా దృష్టిలో మహానుభావుడు అని అర్థం) అనే మకుటంతో అంతం ఔతుంది కనుక మనీషా పంచకం అని పేరు వచ్చింది ఈ స్తోత్రానికి. భారతీయ వేదాంత తత్త్వాన్ని సంక్షిప్తంగా చెప్తే అది మనీషా పంచకమౌ తుంది. భారతీయ ఆధ్యాత్మిక సర్వస్వాన్ని సంక్షిప్తంగా చెప్తే అది మనీషా పంచకమౌతుంది. సమస్త వేదాల, ఇతిహాసాల, పురాణాల సారం మొత్తం సంక్షిప్తంగా ఒకచోట చేరిస్తే అది మనీషాపంచకమౌతుంది.

మరొక అద్భుతమైన రహస్యం ఏమిటంటే ఉపనిషత్తులలో 'శుక రహస్యోపనిషత్' అనే గొప్ప ఉపనిషత్ ఒకటి ఉన్నది. వేదనిలయుడైన దక్షిణామూర్తి అవతారమైన ఆదిశంకరుడు శుకరహస్యోపనిషత్ కు సాక్షాత్తూ అనువాద రూపకంగా మనీషా పంచకాన్ని చెప్పారు, ఆశువుగా!

మనీషాపంచక స్తోత్రమును తెలుసుకొనడానికి ముందు కొంత వేదాంత చర్చ పరిశీలన అవసరం. వేదాంత ప్రపంచంలోఅంటే ఉపనిషత్తులలో గొప్ప సూక్తులవంటివి చిన్న చిన్న వాక్యాల రూపంలో వున్నాయి. వీటినే మహా వాక్యాలు అంటారు. అంటే పరమోన్నత సత్యాలను సూక్ష్మరూపంలో చిన్న చిన్న వాక్యాల రూపంలో చెప్పినవన్నమాట. గణితంలో సూత్రాలవలె. ఈ వాక్యాలను వివరంగా, విపులంగా విశదీకరించి విమర్శ చేస్తే లోతైన సత్యాలు సాక్షాత్కరిస్తాయి. మహా వాక్యాలు అనేకం వున్నాయి,వాటిలో 108 ముఖ్యమైనవి అని చెప్తారు. వాటిలో కూడా 27 ఇంకా ముఖ్యమైనవి. వాటినే మహావాక్య నక్షత్ర మాలిక అంటారు, 27 నక్షత్రములవంటివి ఈ 27 మహావాక్యాలు అనే ఉద్దేశంతో. వీటిలో కూడా 4 మహా వాక్యాలు మహోన్నతమైనవి. వాటినే మహా వాక్య చతుష్టయం అంటారు.
అవి (1) ప్రజ్ఞానం బ్రహ్మ (ఋగ్వేదంలోని ఐతరేయ ఉపనిషత్ లోనిది)
(2) అహం బ్రహ్మాస్మి (శుక్ల యజుర్వేదంలోని బృహదారణ్యక ఉపనిషత్ లోనిది)
(3) తత్త్వమసి (సామవేదంలోని ఛాందోగ్యఉపనిషత్ లోనిది)
(4) అయమాత్మా బ్రహ్మ (అధర్వణవేదంలోని మాండూక్య ఉపనిషత్ లోనిది)

వేదవ్యాసులవారి కుమారుడు శుకమహర్షి మహా జ్ఞాని, పుట్టుకతోనే విరాగి, యోగి, ముక్తుడు. శుక మహర్షికి ఉపనయనానికి యుక్తమైన వయసు వచ్చినది అని భావించిన వ్యాసులవారు తన కుమారుడిని, శుకమహర్షిని తీసుకొని కైలాసానికి పరమశివుని సన్నిధికి వెళ్ళాడు. శివునకు నమస్కరించి తన కుమారుడైన శుకమహర్షికి ఉపనయనం చేసి, బ్రహ్మోపదేశాన్ని, అంటే, గాయత్రీ మంత్ర ఉపదేశాన్ని చేయవలసిందిగా కోరాడు.

పరమశివుడు చిరునవ్వు నవ్వి " నేనొక యోగిని, విరాగిని. నా చేత బ్రహ్మోపదేశం తీసుకుంటే నీ కుమారుడు కూడా సర్వసంగ పరిత్యాగియై, విరక్తుడై నిన్నూ వదిలి వెళ్ళిపోతాడేమో, తర్వాత నన్ను నిందించవద్దు సుమా " అన్నాడు. వ్యాసులవారు ఏదేమైనా సరే, నా కుమారుడికి బ్రహ్మోపదేశాన్ని చేయడానికి మీరే సమర్థులు స్వామీ! మీ చేతుల మీదుగానే ఈ కార్యక్రమాన్ని జరిపించండి అని పట్టుబడితే, సరేనని పరమ శివుడు కైలాసంలో, తన చేతులమీదుగా శుక మహర్షికి ఉపనయనం చేసి, తాను గురువై శుకమహర్షికి బ్రహ్మోపదేశం చేశాడు.

అనంతరం శుక మహర్షి పరమ శివునకు సాష్టాంగ దండ ప్రణామం చేసి, తనకు మహావాక్య చతుష్టయాన్ని ఉపాసనా రూపకంగా ఉపదేశించమని కోరాడు. పరమ శివుడు శుకమహర్షికి పైన చెప్పుకున్ననాలుగు మహావాక్యాలను సాంగోపాంగములుగా, బీజాక్షరములతో, ధ్యాన మంత్రశ్లోకాలతో, అంగన్యాస కరన్యాసాలతో ఉపాసనా మార్గానికి అనువుగా ఉపదేశించాడు. ఆ ఉపదేశాన్ని స్వీకరించిన శుక మహర్షి ఆ వేదాంతజ్ఞానసార మాధుర్యాన్ని మనసారా అనుభవించి, బ్రహ్మానంద సాగరంలో ఈదులాడుతున్న వానివలె అక్కడినుండి వెళ్ళిపోయాడు అని శుకరహస్యోపనిషత్ చెప్తుంది.

మనీషా పంచకంలోని మొదటి నాలుగు శ్లోకాలను నాలుగు మహా వాక్యాలకు అనువాదరూపకంగా, ఐదవ శ్లోకాన్ని ఫలశ్రుతిగా ఆదిశంకరాచార్యులవారు మనకు అనుగ్రహించారు. శుకరహస్యోపనిషత్తును, మనీషా పంచక స్తోత్రాన్నీ పరిశీలిస్తే, పోల్చి చూస్తే మనీషాపంచక స్తోత్రం 'శుక రహస్యోపనిషత్' కు తాత్పర్య రూపకంగా కనిపిస్తుంది! అద్భుతమైన ఈ రహస్యాన్ని అర్థం చేసుకొనడానికి చేసిన చిన్ని ప్రయత్నము యిది.

(1)

జాగ్రుత్ స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృంభతే
యా బ్రహ్మాది పిపీలకాంత తనుషు ప్రోతా జగత్సాక్షిణీ
సైవాహం నచ దృశ్య వస్త్వితి దృఢ ప్రజ్ఞాపి యస్యాస్తిచేత్
చండాలోస్తు సతు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ

అంటే, సమస్త కాలాలలో, సమస్త ప్రాణులలో వెలుగొందుతున్న దివ్య చైతన్యం ఒకటే! ఆ చైతన్యమే నాలోనూ వెలుగొందుతున్నది, కనుక నేను ఎవరికీ భిన్నుడను కాను. నేను అందరిలో ఒకడిని, ఒకడిలో అందరిని. నేను ఎవరికన్నా తక్కువా కాదు, ఎక్కువా కాదు. పైకి కనిపించే ఈ శరీరము నేను కాను. ఈ శరీరం ఒకనాటికి లేకుండా పోయేదే. దానికి సంబంధించిన మెరుగులు, తళుకులు, గొప్పలు ఏవీ శాశ్వతం కావు, అవి కూడా నశించి పోయేవే, కానీ, శరీరంలోపలి దివ్య చైతన్యము సర్వ వ్యాప్తమైనది, అనంతమైనది, శాశ్వతమైనది, అదే నేను. నా శరీరానికి లేకుండా పోవడం వున్నది కానీ, లోపలి దివ్య చైతన్యము నశించిపోనిది. ఈ జ్ఞానం ఉన్న వారెవరైనా, చండాలుడైనా, బ్రాహ్మణుడైనా, ఎవరైనా సరే, వారే నా గురుదేవులు!

మనీషా పంచకంలోని ఈ ప్రథమ శ్లోకం ఋగ్వేదంలోని ఐతరేయ ఉపనిషత్తులోని 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే వేదాంత మహావాక్యానికి ఎంత దగ్గిరగా వుందో చూద్దాం. 'శుకరహస్యోపనిషత్'లో పరమశివుడు శుకమహర్షికి ఈ వేదాంత వాక్యాన్ని ఉపదేశించినప్పుడు రెండు శ్లోకాలను చెప్పాడు, ప్రజ్ఞానం అంటే ఏమిటి అనేది వివరిస్తూ.

'ఏనేక్షతే శ్రుణోతీదం జిఘ్రతి వ్యాకరోతిచ
స్వాద్వస్వాదు విజానాతి తత్ప్ర జ్ఞాన ముదీరితం'...అన్నాడు పరమశివుడు!

అంటే, దేని ద్వారా (బ్రహ్మమును, శాశ్వతమైన సత్యమును) చూడడం, వినడం, వాసన చూడడం అంటే గ్రహించడం, వ్యాప్తి చేయడం అంటే విపులీకరించడం అంటే విశదంగా తెలిసికొనడం జరుగుతుందో అదే ప్రజ్ఞానం అంటే విశిష్టమైన జ్ఞానం. 'ప్రజ్ఞానం బ్రహ్మ'ను వివరిస్తూ..

'చతుర్ముఖేంద్ర దేవేషు మనుష్యాశ్వ గవాదిషు
చైతన్యమేకం బ్రహ్మతః ప్రజ్ఞానం బ్రహ్మమయ్యపి'... అన్నాడు పరమశివుడు!

అంటే చతుర్ముఖుడైన బ్రహ్మ మొదలైన దేవతలలోనూ, మనుషులలోనూ, అశ్వములలోనూ, గోవులలోనూ వున్న బ్రహ్మచైతన్యం ఒక్కటే అనేదే ప్రజ్ఞానం బ్రహ్మ. ఇదె భావాన్ని గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు

'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకేచ పండితాః సమ దర్శినః'... అని వెల్లడించాడు

అంటే విద్య, వినయ సంపన్నుడైన బ్రాహ్మణుడిలోనూ, గోవులోనూ, ఏనుగులోనూ, కుక్కలోనూ, కుక్కమాంసం తినే చండాలుడిలోనూ పండితుడు సమదృష్టి కలిగి ఉంటాడు. అసలు పండితుడు అంటే ఎవరు అనేది కూడా ఆయనే చెప్పాడు, అదే గీతలో, వేరొక చోట! 'యస్య సర్వే సమారమ్భాః కామ సంకల్ప వర్జితాః జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహు: పండితం బుధాః ' అని, అంటే ఎవరి కర్మలు కామములతో అంటే ఏవో కోరికలను తీర్చుకొనడానికి చేసినవి కావో, జ్ఞానమనే అగ్నిలో దహింపబడినవో వానిని పండితుడు అని విద్వాంసులు పలికెదరు అని!

దీనినే అన్నమాచార్యుడు 'నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే, అండనే బంటు నిద్ర అదియునొకటే, మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే, చండాలుడుండేటి సరి భూమి యొకటే.. కడగి ఏనుగుపైన కాయు ఎండయు నొకటే, పుడమి శునకముపైన బొలయు ఎండొకటే.. కందువగు హీనాధికము లిందు లేవు, అందరికి శ్రీహరే అంతరాత్మ!' అని ఆనంద తందనాలాడాడు!

త్యాగరాజస్వామి వారు యిదే భావాన్ని శ్రీరాముని పరంగా 'చీమలో, బ్రహ్మలో, శివ, కేశవాదులలో ప్రేమ మీర చెలగుచుండే బిరుదు వహించిన సీతారామ! నన్ను బ్రోవ రావేమొకో?' అని ఆర్తిగా ప్రశ్నించి వెల్లడించారు! బమ్మెర పోతన మహానుభావుడు కొన్ని వందల పద్యాలలో యిదే భావాన్ని వెల్లడించాడు తన ఆంధ్ర మహా భాగవతంలో! యిదీ భారతీయుల సమదృష్టి! యిదీ భారతీయ జ్ఞానవృష్టి!

సమస్త మానవాళిమాత్రమే కాదు, భగవత్స్వరూపాలే భారతీయుల దృష్టిలో! అందుకే రెండుకాళ్ళ మానవులకే కాదు, నాలుగు కాళ్ళ జంతువులకు కూడా శుభం, సుఖం, శాంతి కలగాలని వేదం ఆశీర్వదించింది 'శంనో అస్తు ద్విపదే శం చతుష్పదే, ఓం శాంతి: శాంతి: శాంతి:' అని!

(2)

బ్రహ్మైవాహ మిదం జగచ్చ సకలం చిన్మాత్ర విస్తారితం
సర్వం చైత దవిద్యయా త్రిగుణయాశేషం మయా కల్పితం
ఇత్థం యస్య దృఢా మతిస్సుఖతరే నిత్యే పరే నిర్మలే
చండాలోస్తు సతు ద్విజోస్తు గురురిత్యేషా మనీషా మమ

వివరణ:

నాలో బ్రహ్మపదార్థమే నిండి వుంది. కంటికి కనిపించే ఈ ప్రపంచమంతా అదే బ్రహ్మపదార్థముచేత, అదే చిన్మాత్ర చేత నిండి వుంది. అంటే నేను నశించి పోయినా, కంటికి కనిపించే ఈ ప్రపంచం నశించి పోయినా, ఆ అంతర్గర్భితమైన బ్రహ్మపదార్థము నశించి పోదు. అది శాశ్వతము, అది మాత్రమే శాశ్వతము! అవిద్యచేత అంటే అజ్ఞానముచేత, సత్వ, రజో, తమోగుణములచేత ప్రభావితుడనై నాతో సహా ఇదంతా అశేషమైనది అని, అనంతమైనది అనీ అంటే అంతం లేనిది, శాశ్వతమైనది అని కల్పించుకొన బడినది. అంటే వాస్తవంగా అది నిజం కాదు అనే దృఢమైన నమ్మకంతో శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన, నిర్మలమైన సుఖాన్ని ఎవరు పొందగలరో వారు జన్మచేత చండాలుడైనా, బ్రాహ్మణుడైనా ఎవరైనా సరే, అతనే నా గురుదేవుడు!

శుక్ల యజుర్వేదం లోని బృహదారణ్యక ఉపనిషత్తులోని 'అహం బ్రహ్మాస్మి' అనే మహా వాక్యానికి నిర్వచన రూపకంగా ఈ రెండవ శ్లోకాన్ని చెప్పారు ఆదిశంకరాచార్యులవారు తమ మనీషాపంచకంలో. బ్రహ్మైవాహం అనే ఎత్తుగడతోనే 'అహం బ్రహ్మాస్మి' అనే మహా వాక్యాన్ని స్పృశించారు. కైలాసంలో పరమశివుడు శుక మహర్షికి ఈ మహావాక్యాన్ని ఉపదేశిస్తూ,

'పరిపూర్ణః పరాత్మాస్మిన్దేహే విద్యాధికారిణీ
బుద్ధేస్సాక్షితయా స్థిత్వా స్ఫురన్నహ మితీర్యతే'... అన్నాడు.

అంటే, పరిపూర్ణుడూ, పరాత్ముడూ ఐన అంటే జీవాత్మకు పరుడు ఐన పరమాత్ముడు ఈ దేహంలో వున్నవాడు, విద్యకు అంటే జ్ఞానానికి అధికారిగా, బుద్ధిరూపకుడిగా, సాక్షిగా వున్నవాడు ఎవరైతే ఉన్నాడో వానినే 'అహం' అని అంటారు అన్నాడు. పరిపూర్ణుడు పరమాత్ముడొక్కడే. ఆ పరిపూర్ణుడే నాలోనూ, ఈ విశ్వమంతటా వున్నాడు. పరిపూర్ణం కాని విశ్వము, నేనూ లేకపోయినా ఈ పరిపూర్ణ పరమాత్ముడు మిగిలి ఉంటాడు, కొనసాగుతుంటాడు. పరమశివుడు తన వివరణను కొనసాగిస్తూ యింకా యిలా అన్నాడు.

'స్వతః పూర్ణః పరాత్మాత్ర బ్రహ్మ శబ్దేన వర్ణితః
అస్మీత్యైక్య పరామర్శః తేన బ్రహ్మ భవామ్యహం'

సహజంగానే పరిపూర్ణుడు, విద్యాధికారిగా అంటే జ్ఞానానికి అధికారిగా, బుద్ధిరూపకుడై సాక్షిగా ఈ దేహంలో వున్న ఆ బ్రహ్మ అనే శబ్దం ద్వారా వర్ణింపబడినవాడనే నేను అయి వున్నాను అని భావించడం ద్వారా, ఆ బ్రహ్మమును అనుభవించడంద్వారా నేనే బ్రహ్మమును అవుతాను, శాశ్వతుడను అవుతాను.

అంటే నేను పైకి కనిపించే నేను కాదు, అంతర్గతంగా వెలుగొందుతున్న ఆ పరమాత్ముడిని. నాశం లేని, పరిపూర్ణుడైన ఆ పరమాత్ముడి అంశనే నేను.
కనుక ఈ శరీరంతో వచ్చిన హెచ్చు తగ్గులు, మంచి చెడులు ఈ శరీరంతోనే పోతాయి కానీ లోపలి ఆ పరిపూర్ణతత్త్వం నిలిచి వుంటుంది. కనుక నాకు అనగా నా ఆత్మకు నాశనం లేదు, నా దేహానికి మాత్రమే నశించి పోవడం ఉన్నది అనే జ్ఞానం కలిగిన వారు జన్మచేత చండాలుడైనా, బ్రాహ్మణుడైనా ఎవరైనా సరే, వారే నా గురుదేవుడు!

(3)
శశ్వన్నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచా గురో
నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజ
భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే పావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపురిత్యేషా మనీషా మమ

వివరణ :
కంటికి కనిపించే ఈ విశ్వమంతా నశించిపోయేదే. విశ్వములో అంతర్గర్భితంగా వున్న బ్రహ్మతత్త్వమొక్కటే నశించనిది, సత్యమైనది, శాశ్వతమైనది అనే గురు వాక్యములను నిరంతరం మననం జేసుకుంటూ, ఏ కారణం లేకుండా శాంతుడై, భూత, భవిష్యద్వర్తమానకాలములకు చెందిన కర్మఫలితములను గురువాక్య ప్రబోధంద్వారా కలిగిన జ్ఞానమనే అగ్నిలో దహించి వేసి, ప్రారబ్ధ, సంచిత, ఆగామి కర్మఫలితములను తాను పొందకుండా నిస్సంగుడై చరించే మానవుడు జన్మచేత చండాలుడైనా, బ్రాహ్మణుడైనా, ఎవరైనా సరే, అతనే నా గురుదేవుడు!

మనీషా పంచకంలోని ఈ మూడవ శ్లోకంలో 'వాచా గురో' అనడం ద్వారా 'గురుదేవుని వాక్యములు అంటే గురుదేవుని ఉపదేశం' అనడంతో పాటు 'మహా వాక్యములు అంటే గురువాక్యములు కనుక మహావాక్య చతుష్టయాన్ని' సూచించారు ఆదిశంకరాచార్యులవారు!

మహా వాక్య చతుష్టయంలోని మూడవది ఐన 'తత్త్వమసి'కి మనీషా పంచకంలోని ఈ మూడవ శ్లోకం వ్యాఖ్యాన పూర్వకంగా వెలయించినది అనడంలో సందేహం అవసరం లేదు. 'తత్త్వమసి' అనే మహావాక్యం సామవేదంలోని ఛాందోగ్య ఉపనిషత్తు లోనిది. దీనిని శుకమహర్షికి ఉపదేశిస్తూ, శుక రహస్యోపనిషత్ లో, పరమశివుడు

'ఏకమేవాద్వితీయం సన్నామ రూప వివర్జితం
సృష్టే: పురాధునాప్యస్య తాదృక్త్వం తదితీర్యతే'... అన్నాడు.

అంటే, తాను మాత్రమే ఒకటిగా వున్నది, తను తప్ప రెండవది ఏదీ లేనిది, నామ రూపములనే భేదములు లేనిది, నామ రూపములు అంటూ తెలియరానిది, సృష్టికి పూర్వమూ యిప్పుడు కూడా వున్నది, అంటే ఎప్పటికీ వుండేది, నాశనం లేనిది, విమర్శ చేయడం ద్వారా ఇప్పటికీ తెలియదగినదీ ఏది కలదో దానినే 'తత్' అంటారు అని అర్థం!

అంటే విశ్వములో, అన్నింటా వుండినదీ, వుంటున్నదీ, వుండేదీ ఐన 'బ్రహ్మ తత్త్వ' నాశము లేనిది, కానీ విశ్వమూ, విశ్వములోని సమస్తమూ నశించి పోయేవే! అది ఒక పేరుతో, ఒక రూపముతో తెలిసికొన గలిగినది కాదు, కనుకనే కేవలం గుర్తుగా 'అది' అంటే, 'తత్' అని అనబడేది! 'యదా నద్యః స్యన్దమానాః సముద్రేస్తం గచ్ఛంతి నామ రూపే విహాయ। తథా విద్వాన్ నామ రూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యం', ఏ విధంగా రక రకాల పేర్లతో, రూపాలతో ప్రవహించే నదులు సముద్రంలో కలిసిపోయిన తర్వాత ఏ పేరూ, ఏ రూపమూ లేకుండా పోతాయో, ఆ విధంగా పండితులు నామ,

రూపముల భేదములు లేకుండా పరమాత్ముడనే సాగరమును చేరుకుంటారు అని మరొక ఉపనిషత్ చెప్పింది! ఈ పేర్లూ, రూపాలూ, విధానాలూ కేవలం గుర్తుకోసం మనం కల్పించుకున్నవే. ఏ పేరుతో పిలువబడే నది ఐనా దాహం తీర్చడం, తన జలధారల ద్వారా పండిన పంటలచేత ఆకలిని తీర్చడమే చేసేది, ఆధ్యాత్మిక జ్ఞానం ఏ పేరుతో, ఏ మార్గంలో పొందినా ఐహిక ప్రపంచపుబాధలు అనే దాహాన్ని, ఆకలిని తీర్చడానికే, యిదీ భారతీయ వేదాంత సమన్వయసారదృష్టి, జ్ఞాన వృష్టి!

'తత్త్వమసి' ని బోధిస్తూ, శుకరహస్యోపనిషత్ లో, రెండవ శ్లోకంలో పరమశివుడు

'శ్రోతుర్దే హేన్ద్రియాతీతం వస్త్వత్ర త్వం పదేరితం
ఏకదా గ్రాహ్యతేసీతి తదైక్య మనుభూయతాం'...

అని'తత్త్వమసి 'మహావాక్యాన్ని వివరించి ఉపదేశించాడు! అంటే, నామము ద్వారా పలకడానికీ, రూపంద్వారా చూడడానికీ సాధ్యం కానిది అని చెప్పబడిన 'తత్' అనబడిన 'అది' శ్రోత్రము ద్వారా అంటే వినికిడి ద్వారా కూడా తెలియబడనిది. ఇంతవరకూ మూడు ఇంద్రియముల ద్వారా తెలియబడనిది (మూడు అంటే సమస్తం అని! కనుకనే ఎన్నిసారులు ఆచమించాలి అంటే మూడుసార్లు అంటే అనేక మార్లు, ఎన్ని ప్రదక్షిణలు అంటే మూడు, ఎన్ని నమస్సులు అంటే మూడుసార్లు నమస్కారాలు అని నిర్దేశించింది!)

అంటే సకల ఇంద్రియములద్వారా తెలియబడనిది, పంచ కర్మేంద్రియముల ద్వారా, పంచ జ్ఞానేంద్రియముల ద్వారా కూడా సంపూర్ణంగా తెలియబడనిది, వస్తుతః 'త్వం' పదముచేత తెలియదగినది, 'త్వం' అంటే నీవు అని అర్ధం కనుక, ఆ పైన వివరించిన లక్షణములను కలిగిన 'బ్రహ్మ పదార్ధమే' నీవు కనుక, 'చతుర్ముఖ బ్రహ్మ, యితర దేవతలు మొదలుకొని సమస్త జీవ రాశులలోనూ నిండి వున్నది అదే కనుక' (ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మోస్మి ప్రకారం) ఆ పదార్ధమే 'త్వం' అంటే నీవు. అదే నీవు! ఆ బ్రహ్మ పదార్ధమే నీవు! నీవు దేవుడవే! నీవు అమరుడవే! అమృత పుత్రుడవే అనే భావాన్ని 'అసి', అంటే, అయి వున్నాను అని అర్ధం కనుక, అదే నీవు అయి వున్నావు అనే సత్యాన్ని విమర్శించి, తెలిసికొని, ఆ బ్రహ్మైక్య భావాన్ని పొందవలెను! దేహము, విశ్వము నశించి పోయేవే. కానీ, దేహములోని, విశ్వములోని దైవం నశించిపోనిది కనుక, దేహము ద్వారా చేసే కర్మలద్వారా వచ్చే ఫలితములను అంటకుండా, అంటే ఆ ఫలితములను ఆశించకుండా పరమాత్మకు సమర్పణం చేయడమే కర్తవ్యం. అదే కర్మయోగం! అంటే చేసేదీ నీవు కానప్పుడు, చేయించేదీ నీవు కానప్పుడు, ఆ ఫలితములూ నీవి కానప్పుడు ఇక దుఃఖానికి ఏ కారణం వుంటుంది, దుఖం ఎందుకుంటుంది?

వేదాంత ప్రపంచంలో తత్త్వమసి అనే మహావాక్యాన్ని ఉపదేశ వాక్యం అన్నారు.
ఈ భావాన్నే ఉపదేశ రూపకంగా శ్రీ కృష్ణుడు అర్జునునితో ' కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన మా కర్మ ఫలహేతుర్భూ: మాతే సంగోస్త్వ కర్మణి ' కర్మములు చేయుటయందే నీకు అధికారము కలదు కానీ వాని ఫలితములందు లేదు, నీవు కర్మ ఫలితములకు కారణము కారాదు, అట్లని కర్మలు చేయుట మానరాదు అని 'ఉపదేశించాడు! కనుక, ఈ జ్ఞానము ద్వారా సంక్రమించిన జ్ఞానమనే అగ్నిలో ప్రారబ్ధ, సంచిత, ఆగామి కర్మ ఫలితములను నిరంతరం గురువాక్యములద్వారా సంప్రాప్తించిన జ్ఞానమనే అగ్నిలో దహించి, ఏదీ నీది కాదనే, ఏదీ నిలిచిపోదనే, ఏదీ వెంట రాదనే సత్యం 'అనుభవంలోకి వచ్చిన తర్వాత' మిగిలేది ఏ కదలికలూ, కల్లోలాలూ లేని ప్రశాంతతే కనుక, ఆ అనుభవం పొందిన, శాంతాత్ముడై వుండే మహానుభావుడు జన్మచేత చండాలుడైనా, బ్రాహ్మణుడైనా, ఎవరైనా సరే, ఆయనే నా గురుదేవుడు, అన్నాడు ఆదిశంకర గురుదేవుడు!

(4)

యా తిర్యన్నర దేవతాభి రహమిత్యంత స్ఫుటా గృహ్యతే
యద్భాసా హృదయాక్ష దేహ విషయాభాంతి స్వతో చేతనా
తాం భాస్యై: పిహితార్క మండల నిభాం స్ఫూర్తిం సదా భావయన్
యోగీ నిర్వృత మానసోహి గురురిత్యేషా మనీషా మమ

వివరణ:

ఏ పరమాత్ముని 'కళ' కదిలే వానిలో(తిర్యక్కులలో), మానవులలో, దేవతలలో, అందరిలో, అన్నింటా స్ఫుటంగా స్పష్టముగా కనిపిస్తుందో, గ్రహింపబడుతుందో, ఏ పరమాత్ముని 'కళ' హృదయ కుహరములో వెలుగొందడం వలన స్వతహాగా కళ, చైతన్యం, కదలిక లేనివి కళ, చైతన్యం, కదలిక వున్నవానిలాగా కనిపిస్తాయో, ఏ వెలుగు అంతర్గతంగా వెలుగొందుతుండడం వలన పైకి కనిపించే శరీరాలు, జీవులు ఆ వెలుగును కళను (ప్రాణకళ,జీవకళ) ను కలిగిఉన్నట్లుగా కనిపిస్తాయో ఆ కళ, ఆ వెలుగు, ఆ చైతన్యము సత్యము, నిత్యము, శాశ్వతము అని తెలిసికొన్న మహానుభావుడు, నిరంతరమూ ఆ స్ఫూర్తిని, ఆ సత్యమును, నిత్యమును, శాశ్వతమును మననం చేసే మహానుభావుడు జన్మచేత చండాలుడైనా, బ్రాహ్మణుడైనా ఎవరైనా సరే, ఆయనే నా గురుదేవుడు, నా దృష్టిలో మహానుభావుడు!

మనీషాపంచకంలోని ఈ నాలుగవ శ్లోకం అధర్వణవేదంలోని మాండూక్య ఉపనిషతు లోని 'అయమాత్మా బ్రహ్మ' అనే మహావాక్యానికి వ్యాఖ్యాన పూర్వకమైనది! పరమశివుడు శుకమహర్షికి ఈ మహావాక్యాన్ని ఉపదేశిస్తూ

'స్వప్రకాశాపరోక్షత్వం అయమిత్యుక్తితో మతం
అహంకారాది దేహాంతం ప్రత్యగాత్మేతి గీయతే '... అన్నాడు.

అంటే స్వప్రకాశమైనది, తనే తనంతగా వెలిగేది, ఎక్కడినుండో తెచ్చుకున్నవెలుగుతో వెలిగేది కానిది, తనే వెలుగుతూ వెలిగించేది, అపరోక్షం అంటే పరోక్షం కానిది, అంటే ప్రత్యక్షమైనది, 'అయం', 'ఇది' అనబడేది 'అహంకారం' మొదలైన వాటికీ భిన్నమైనది, అది ప్రత్యగాత్మ అనబడుతుంది. పరమశివుడు ఇంకా

'దృశ్య మానస్య సర్వస్య జగతత్త్వ మీర్యతే
బ్రహ్మ శబ్దేన తద్బ్రహ్మ స్వప్రకాశాత్మ రూపకం'... అన్నాడు.

అంటే కంటికి కనిపించే సర్వజగమూ ఆ బ్రహ్మ పదార్థముచేత, అంటే ఆ ప్రత్యగాత్మచేత నిండి వున్నది. ఆ బ్రహ్మ పదార్థము, ఆ ప్రత్యగాత్మ స్వప్రకాశమైనది. అంటే అదే నిజమైన వెలుగు. ఆ వెలుగే మిగిలినవన్నీ వెలిగేటట్లుగా చేస్తుంది, వాటిలో అంతర్గతంగా తాను వెలగడం ద్వారా. ఈ వెలుగు ఉన్నంత కాలమే అవి వెలుగుతున్నట్లుగా కనిపిస్తాయి. సూర్యుని వెలుగును చంద్రుడు, నక్షత్ర, గ్రహగణాలు గ్రహించి వెలుగుతున్నట్లుగా, విద్యుత్తును గ్రహించి విద్యుద్దీపాలు వెలుగుతున్నట్లుగా. కనుక ఆ శాశ్వతమైన వెలుగును గుర్తించి, గుర్తుంచుకుంటూ, నిరంతరం మననం చేసే మహానుభావుడు ఎవరైనా సరే అతనే నా గురుదేవుడు!

ప్రాణుల శరీరాలలో ఆ వెలుగు ప్రాణశక్తిగా ఉన్నంత వరకే ప్రాణులు కళ కళలాడుతూ వుంటాయి, ఆ కళ తప్పితే కట్టెలవుతాయి. కనుక శరీరాలూ, శరీరధారులూ శాశ్వతులు కారు. ఆ శరీరాలలోసమానంగా వెలుగొందే ప్రత్యగాత్మ ఐన ఆ 'కళ', ఆ బ్రహ్మపదార్థమే శాశ్వతం. కనుక శరీరానికి కాకుండా, శరీరికి అంటే లోపలి వెలుగుకి ప్రాధాన్యత నిచ్చేవాడూ, ఆ లోపలి వెలుగు అందరిలోనూ, అన్నింటిలోనూసమానంగా వున్నది కనుక, అందరూ, అన్నీ సమానమే అని భావించేవాడు, ఆ శాశ్వతమైన వెలుగును గుర్తించి నిరంతరం స్మరించే వాడూ ఎవరో అతనే నా గురుదేవుడు!

(5)

యత్సౌఖ్యామ్బుధి లేశ లేశత ఇమే శక్రాదయో నిర్వృతా
యచ్చిత్తే నితరాం ప్రశాంత కలనే లబ్ధ్వా మునిర్నిర్వృత
యస్మిన్ నిత్య సుఖామ్బుధౌ కలిత దీ ర్బ్రహ్మైవ న బ్రహ్మవిత్
యః కశ్చిత్ ససురేంద్ర వందిత పదో నూనం మనీషా మమ

ఏ ఆనంద సాగరపు లేశమైనా పొందినందుకు దేవేంద్రాదులు కూడా సంతసించి తరించి పోతారో, కేవలం దేనిని మాత్రమే మనసులో పొందినందుకు మహా మునులు కూడా తరించిపోతారో, ఏ నిత్యమైన శాశ్వతమైన ఆనంద సాగర అనుభవం చేత అనుభవించేవాడూ, ఆ అనుభవమూ ఏకమైపోతారో, అంటే, అనుభవించేవాడు తనే ఆ అనుభవమై పోతాడో, అటువంటి ఆ అద్వైతానుభవ ఆనంద సాగరమును చవిజూసిన వాడూ, దేవేంద్రాదులచేత కూడా నమస్కరింపబడిన పాదపద్మములు గల
ఆ మహానుభావుడే నా గురుదేవుడు! ఆదిశంకరాచార్యులవారు యింతవరకూ శుక రహస్యోపనిషత్తుకు వ్యాఖ్యాన పూర్వకంగా చెప్పిన మనీషా పంచకంలోని చివరి ఐదవశ్లోకం ఇది. ఈ స్తోత్ర ఫల శ్రుతిగా, శుక రహస్యోపనిషత్తుకు ఫలశ్రుతిగా, ఈ రెండింటిని తెలిసికొని, ఆచరించి, అనుభవించిన ఆనందానికి ఫల శ్రుతిగా ఈ చివరి శ్లోకాన్ని చెప్పారు!

శుక రహస్యోపనిషత్తు చివరిలో, పరమ శివుడు తనకు నాలుగు మహావాక్యములను ఉపాసనా మార్గంలో ఉపదేశించిన తర్వాత, ఆ మహావాక్య అనుభవ సారమనే ఆనంద సాగరంలో ఈదు లాడుతున్నవానివలె, పరమేశ్వరునకు నమస్కరించి శుకమహర్షి అక్కడినుండి స్వేచ్ఛగా వెళ్ళిపోయాడు అని శుకరహస్యోపనిషత్తు ముగింపు జరుగుతుంది. ఇక్కడ అదే భావాన్ని వ్యక్తం చేసిన ఆది శంకరాచార్యులవారు మహావాక్య చతుష్టయాన్ని, వాటిని ఉపదేశించిన శుకరహస్యోపనిషత్తునూ, ఆ ఉపనిషత్తుకు వ్యాఖ్యానపూర్వకంగా చెప్పిన మనీషాపంచక స్తోత్రమునూ పఠించిన, అవగతం చేసుకున్న, అనుభవించిన ఫలితము ఏమిటో ఫలశ్రుతిగా ఈ చివరి శ్లోకంలో చెప్పారు!

మనీషా పంచకమును ఎందరో మహానుభావులు, జగద్గురువులు, గురుతుల్యులు, పండితులు పూర్వం వ్యాఖ్యానించి వున్నారు. వారి ప్రజ్ఞలో ఆవగింజలో అరవయ్యవ వంతు కూడా లేని అల్పుడిని అజ్ఞానిని నేను.

నా అదృష్టకారణంగా, ఆదిశంకరుల మీద నాకున్న కేవల భక్తి భావ విశేషం చేత, ఆ గురుదేవుని కృపచేత, శుకరహస్యోపనిషత్తుకు అనువాదపుర్వకమా అన్నంత సారూప్యాన్ని, సామీప్యాన్నిమనీషా పంచకం కలిగివుందని తెలుసుకున్నాను.

ఆ సారూప్యాన్ని, పోలికలను బయటకు తెచ్చేఉద్దేశంతో, ఆదిశంకరుని పలుకులు ఉపనిషత్తుల మందాకినీ కులుకులు అని మరొక దృష్టాంతం పాఠకుల దృష్టికి తీసుకొచ్చే ఉద్దేశంతో ఈ చిన్ని ప్రయత్నమును చేయడం జరిగింది. మనీషాపంచకములోని ఐదు శ్లోకాలకూ ఈ వ్యాసంలో ఇచ్చిన అనువాద గేయాలు నేను రచించినవి. మనీషాపంచకం మీది ప్రేమ కారణంగా, సంస్కృతం లోని ఆ శ్లోకాలను తెలుగులో సరళంగా అందించడం ఆ శ్లోకాలను సులభంగా అర్థం చేసుకోవడానికి సహకారంగా వుంటుందని అని అనువదించడం జరిగింది.

ఈ దీర్ఘ వ్యాసంలో ఏవైనా దోషాలుంటే పాఠకులు మన్నింతురుగాక! తన స్తోత్రఫలముగా గురుదేవుడు ప్రవచించిన మానసిక ప్రశాంతత నాకూ, నాలాంటి ఎందరో సామాన్య జనులకు లభించునుగాక! ఆదిశంకర దివ్యవాణి అనంతకాలములందు అవనిలో ప్రతిధ్వనించును గాక!

మనీషాపంచకం - విపుల వ్యాఖ్యానం సంపూర్ణం

ఓం తత్ సత్.. ఓం శాంతిః శాంతిః శాంతిః

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

1

Wake up the note! the song that had its birth
Far off, where worldly taint could never reach,
In mountain caves and glades of forest deep,
Whose calm no sigh for lust or wealth or fame
Could ever dare to break; where rolled the stream
Of knowledge, truth, and bliss that follows both.
Sing high that note, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

ముముక్షు గీతాలు

1

మేల్కొల్పుము ఆ స్వరమును! యోగీ! జన్మించినదా ప్రాక్తన గీతిక
ప్రాపంచికమౌ పంకములంటని అనంత కాలపు పూర్వ దూరముల,
కొండగుహలలో, ఘన గహనములౌ పచ్చికబయళ్ళ కారడవులలో,
కోట్ల సంపదల, గొప్ప యశస్సుల
కోర్కెల కోటుల నిట్టూరూపులు
చలింపజేయని శాంతిగీతమును, పరుగులెత్తుచు పారెనెచ్చట
జ్ఞానవాహినులు, సత్యవాహినులు, జ్ఞాన సత్యఫల శాంతవాహినులు
అప్పటి దట్టిది గీతము పాడుము
పై షడ్జమమున సాహసయోగీ!
పలుకుము కులుకుము పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

2

Strike off thy fetters! Bonds that bind thee down,

Of shining gold, or darker, baser ore;

Love, hate—good, bad—and all the dual throng,

Know, slave is slave, caressed or whipped,

not free; For fetters, though of gold, are not less

strong to bind; Then off with them, Sannyasin

bold! Say—

"Om Tat Sat, Om!"

ముముక్షు గీతాలు

2

శృంఖలములనిక తెంపివేయుము, తెంపుము యోగీ బంధనాలను,
పసిడిమిసిమివి, నల్లని, నీచములగు లోహములవి,
రాగము-ద్వేషము, మంచీ-చెడులను ద్వంద్వ బంధముల!
తెలియుము బానిస బానిస,
బందీ, లాలించిననూ శిక్షించిననూ!
బంగరు సంకెలలూ బంధములే! బలవంతములే, పలువంతలవే!
సంకెలలన్నీ తెంపి స్వేచ్ఛగా
సాగుము ముందుకు సాహసయోగీ!
పలుకుము, కులుకుము, పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

3

Let darkness go; the will-o'-the-wisp that leads
With blinking light to pile more gloom on gloom.
This thirst for life, for ever quench; it drags
From birth to death, and death to birth, the soul.
He conquers all who conquers self. Know this
And never yield, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

3

తమస్సు పోనీ, ఉషస్సు రానీ, క్షణికములివి! క్షణికములివి!
లోని మిణుకు మిణుకు మని చీకటి మిన్నగ జేసే
మిణుగురు లణగుచు పోనీ జీవన దాహమ దారని దాహము,
తీరని దాహము, లాగునులే నీ ఆత్మను పుట్టుట, చచ్చుట,
మరలా పుట్టుట, చచ్చుట యను వలతోనే
తనను తాను జయించినవాడు జయించును అందరినీ,
అవగత మిది కానీ!
లొంగకు, కుంగకు, సాహసయోగీ!
పలుకుము, కులుకుము, పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

4

"Who sows must reap," they say, "and cause must bring The sure effect; good, good; bad, bad; and noneEscape the law. But whoso wears a formMust wear the chain." Too true; but far beyondBoth name and form is Atman, ever free. Know thou art That, Sannyasin bold! Say— "Om Tat Sat, Om! "

ముముక్షు గీతాలు

4

నాటినవాడే ఫలభోక్తయని అనరా, తప్పదు,
కారణము సదా ఫలితమునిచ్చును ఖచ్చితంబుగా,
మంచి, చెడులకు మంచి, చెడులు!
అతీతుడెవడిట అనంతశక్తికి? దేహభావమిదు దేహబంధములు!
సత్యము, బహుధా శతసహస్రధా! అన్నిటికావలి అనంతసత్యం
దేహి దేహములు ఆత్మయన్న దది అద్వితీయము, బంధముక్తము!
అదే నీవని, ఆత్మ నీవని తెలియుము 'తత్త్వ'
తత్త్వమసి! తత్త్వమసి! తత్త్వమసి! సాహసయోగీ!
పలుకుము, కులుకుము, పరవశములగొని పాడుము, పాడుము!
ఓం తత్ సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

5

They know not truth who dream such vacant dreams As father, mother, children, wife, and friend. The sexless Self! whose father He? whose child? Whose friend, whose foe is He who is but One? The Self is all in all, none else exists; And thou art That, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

ముముక్షు గీతాలు

5

వారికి తెలియదు సత్యము, నిత్యము
శూన్య స్వప్నములు చూచు వారికి,
తల్లి, తండ్రి, సుతులు, సతులు, స్నేహితులంటూ
శూన్య స్వప్నములు చూచువారికి!
లింగ, సంగములు లేని ఆత్మ యగు నెవరికి తండ్రి? ఎవరికి శిశువు?
ఎవరికి స్నేహితు? డెవరికి శత్రువు యగు నతఁడెపుడు ఒకడగు నతఁడు?
ఆత్మ యొక్కటై, సర్వమయంబై, సమమై యున్నది, యితరము లేదు
అదే నీవని, నీ వాత్మవని, దేహము కాదని, సర్వమొక్కటని, సాహసయోగీ!
పలుకుము, కులుకుము, పరవశములగొని పాడుము, పాడుము!
ఓం తత్ సత్ ఓం!

6

There is but One—The Free—The Knower—Self!

Without a name, without a form or stain.

In Him is Maya dreaming all this dream.

The witness, He appears as nature, soul.

Know thou art That, Sannyasin bold! Say—

"Om Tat Sat, Om!"

ముముక్షు గీతాలు

6

ఉన్నది ఒకడే!
ముక్తుడు, జ్ఞాత, ఆత్మ యొక్కటే!
నామ, రూపములు దోషము లేని
ఆత్మయందు కల గాంచును మాయ, కల లాత్మకు కల్పించును మాయ,
సాక్షీభూతుడు ఆత్మ ప్రకృతికి, జీవికి; సాక్షి!
అదే నీవని, నీవాత్మవని, దేహము కాదని తెలుసుకొమ్మిక సాహసయోగీ!
పలుకుము కులుకుము పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం !

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

7

Where seekest thou? That freedom, friend,
this world Nor that can give. In books and
temples vain Thy search.
Thine only is the hand that holds
The rope that drags thee on. Then cease lament,
Let go thy hold, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

7

ఎచ్చట వెదికెదవోయి నేస్తమా?
ఆ స్వేచ్ఛను నీకు యివ్వగలేదీలోకము,
ఆ లోకము కూడా యివ్వగలేదు; దానిని గ్రంథములు,
దేవళముల యందు వ్యర్థముగా శోధించెదరంతా!
నీచేతులలోనే నీ బంధనముల త్రాళ్లు!
అవే కదా లాగేను సదా నిను; స్వయంకృతానికి శోకింపకుమా!
కట్టుతాళ్ళనిక పట్టుకోక వదిలించుకొమ్మిక సాహసయోగీ!
పలుకుము కులుకుము పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

8

Say, "Peace to all: From me no danger be
To aught that lives. In those that dwell on high.
In those that lowly creep, I am the Self in all!
All life both here and there, do I renounce,
All heavens and earths and hells, all hopes
and fears."Thus cut thy bonds, Sannyasin bold!
Say—
"Om Tat Sat, Om!

ముముక్షు గీతాలు

8

పలుకుము 'కలుగును శాంతి అందరికి!
అపాయముండదు నాచే ఎవరికీ
ఏ జీవులకూ, నిర్జీవులకూ!
ఉత్తమ ప్రాణులలోనూ నేనే
నీచ ప్రాణికోటులలో నేనే! అఖిలములందగు ఆత్మను నేనే!
యిహ పరములలో జీవము నాకిక పరిత్యాగము,
లేవిక నా కే ఊర్ధ్వలోకములు, భూలోకములు, అధోలోకములు,
ఆశలు, భయములు'
తెంపుకొమ్మలా నీ బంధనమ్ముల!
విరాగీ! త్యాగీ! సాహసయోగీ!
పలుకుము కులుకుము
పరవశముల గొని పాడుము! పాడుము! ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

9

Heed then no more how body lives or goes,
Its task is done. Let Karma float it down;
Let one put garlands on, another kick
This frame; say naught. No praise or blame
can be Where praiser praised, and blamer
blamed are one.Thus be thou calm,
Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

9

శరీర మెవ్విధి నిలిచి వుండునో, కరిగిపోవునో తలంపబోకిక,
తీరిపోయె నది, కర్మవాహినుల తేలి సాగనీ!
నీ దేహమును పూల మాలికలలోన తేల్చినా,
పాదఘూతముల నేల కూల్చినా ఏమనబోకు!
ప్రశంసలు, అభిశంసన లెటుల?
ఒకటే కద ఆ ప్రశంసకుడు - ఈ ప్రశంసితుడు,
ఆ అభిశంసకు డీ అభిశంసితుడు!
కావున శాంతుడవగుము విరాగీ! సాహస యోగీ!
పలుకుము కులుకుము పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

10

Truth never comes where lust and fame and greed Of gain reside. No man who thinks of woman As his wife can ever perfect be;
Nor he who owns the least of things, nor he Whom anger chains, can ever pass thro
' Maya's gates.
So, give these up, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

10

సత్యము ప్రత్యక్షము కాదెపుడూ కామము, మోహము,
కీర్తి, లోభము లాభపు టాశలు నీలోనున్న!
అతివను ఆలిగ తలచే పురుషుదు,
దోషరహితునిగ అవదెన్నటికీ!
కాంత కంకితుడు కళంకితుండౌ!
అత్యల్పము ఆస్తిగ కలిగున్నా, తనదనుకొను ఏ స్వల్పమదున్నా,
కోపపు వలలో బంధితుడైనా మాయాద్వారము దాటదెవ్వడూ!
వీటన్నిటినీ వీడి, విరాగీ! సాహసయోగీ!
పలుకుము కులుకుము
పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

11

Have thou no home. What home can hold thee, friend?The sky thy roof, the grass thy bed; and foodWhat chance may bring, well cooked or ill, judge not.No food or drink can taint that noble Self Which knows Itself. Like rolling river free Thou ever be, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

ముముక్షు గీతాలు

11

గృహమిక వలదు!
ఏ గృహమాపును హితుడా నిన్ను?
పైకప్పిక గగనము నీ కయ్యా, పచ్చిక శయ్య!
నీ యాహారము అదృష్ట ఫలము,
పక్వ మపక్వము గణింపబోకు,
అన్న పానములు అంటవు ఘనమౌ నీ యాత్మను
నీ యాత్మ యెరుంగును తనను;
స్వేచ్ఛగా పారే నదిలా మారుము,
ఆగక స్వేచ్ఛగ సాగుము!
సాహసయోగీ! పలుకుము కులుకుము
పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

SONGS OF SANNYASIN by SWAMI VIVEKANANDA:

12

Few only know the truth. The rest will hate
And laugh at thee, great one; but pay no heed.
Go thou, the free, from place to place, and help
Them out of darkness, Maya's veil. Without
The fear of pain or search for pleasure, go
Beyond them both, Sannyasin bold! Say—
"Om Tat Sat, Om!"

ముముక్షు గీతాలు

12

సత్యము తెలిసిన వారు కొందరే! ద్వేషింతురు నిను యితరులందరూ
పరిహాసింతురో పరమపురుషుడా! పరిగణింపకో మహానుభావా!
సాగుము స్వేచ్ఛగ స్థలములన్నిటా,
సాయ మొనర్చుము దరికి చేర్చుము
అంధకారములనుండి, అందరిని, మాయాచక్రపు బంధమునుండి,
బాధల భయములు, సౌఖ్యముకొఱకై శోధన లెరుగక,
ఆ రెండిటికీ అతీతుండవై, అద్వంద్వుడవై
సాగుము ముందుకు సాహసయోగీ!
పలుకుము కులుకుము పరవశముల గొని పాడుము! పాడుము!
ఓం తత్సత్ ఓం!

13

Thus, day by day, till Karma's powers spent

Release the soul for ever. No more is birth,

Nor I, nor thou, nor God, nor man. The "I"

Has All become, the All is "I" and Bliss.

Know thou art That, Sannyasin bold! Say—

"Om Tat Sat, Om!"

13

అలా అలా నీవిలాతలాన

రోజు రోజుకూ కర్మ ఫలంబుల ఖర్చు పెట్టరా!

ఆత్మను ముక్తమొనర్చు మెన్నటికి, అంతము నీకిక పుట్టుటన్నది,

లేదిక నేను, లేదిక నీవు, లేదిక దైవీ మానవ భావన!

ఆ నే నన్నది ఈ అన్నిటిలో ఆత్మగ తానే మిన్నగున్నది!

ఇక అంతమెరుంగని శాంతి యున్నది!

తెలిసికొమ్ము ఆ ఆత్మవు నీవు! శాంతస్వాంతా! సాహసయోగీ!

పలుకుము కులుకుము పరవశముల గొని పాడుము! పాడుము!

ఓం తత్సత్ ఓం!